సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



గరుడ గమనా.. పుష్పక వాహనా..

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అంతర్వేది లక్ష్మీ నృసింహస్వామికి బుధవారం సాయంత్రం గరుడ పుష్పక వాహనం, రాత్రి పుష్పక వాహనంపై గ్రామోత్సవాలు నిర్వహించారు.


8 లో



స్కూలు బస్సు ఢీకొని చిన్నారి మృతి

ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల బస్సు ఢీకొని మూడేళ్ల చిన్నారి శివకోటి సుకన్య దుర్మరణం పాలైన ఘటన తొండంగి మండలం సీతారాంపురంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

డెల్టాలకు 8,550 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,450, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

యువత ఉపాధి కల్పనకు శిక్షణ

1ఎం1బీ సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష



కలెక్టర్‌ను కలుసుకున్న 1ఎం1బీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అమలాపురం రూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనతో పాటు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వారి భవిష్యత్ కార్యచరణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని '1ఎం1బి' ప్రతినిధులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వన్ మిలియన్ వన్ బిలియన్ (1ఎం1బి) స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సమావేశమై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించడంతో పాటు ఉన్నత పాఠశాలలు, ఆ పై తరగతుల విద్యార్థులకు వారి భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలే అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని వివిధ నైపుణ్యాభివృద్ధి కోర్సుల ద్వారా శిక్షణను అందించాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ అభిరామ్ మాట్లాడుతూ స్కిల్ అండ్ జాబ్ రెడీనెస్ కోసం తమ సంస్థ పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ వివరించారు. సమావేశంలో వికాస జిల్లా మేనేజర్ గొల్ల రమేష్, 1ఎం1బి సంస్థ ప్రోగ్రాం మేనేజర్ రెమ, జిల్లా హెడ్స్ జాన్, సాగర్ పాల్గొన్నారు.

కొయ్ బాబూ.. కొయ్!





అమలాపురం ఏరియా ఆస్పత్రి వద్ద తమకు దృష్టిలోపం ఉందని నిరూపించుకునేందుకు వచ్చిన పింఛన్ లబ్ధిదారులు

- కూటమి పాలనలో కోతల పర్వం
- పెన్షనర్ల తొలగింపునకు ఎత్తుగడ
- తనిఖీల పేరుతో ముప్పతిప్పలు
- వ్యయ ప్రయాసలకు గురవుతున్న దివ్యాంగులు, మానసిక వ్యాధిగ్రస్తులు

సాక్షి, అమలాపురం: కుల.. మత.. ప్రాంత.. రాజకీయ పార్టీలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందించాలంటే పాలకునికి ఉదార స్వభావం ఉండాలి. అన్నింటికీ మించి సమాజానికి మంచి చేయాలనే తపన.. చిత్తశుద్ధి ఉండాలి. కాని ప్రస్తుత పాలకుడు చంద్రబాబుకు ఇవేమీ లేవు. ఉన్నదల్లా ఎన్నికలకు ముందు ఓటర్లకు బూటకపు హామీలు ఇవ్వడం.. ఎన్నికలైన తరువాత వాటిని పక్కన పెట్టేయడమే. అంతేకాదు.. గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలకు సైతం కోత పెట్టడం బాబు మార్కు పాలన. ఇందుకు తాజా ఉదాహరణ జిల్లాలో పింఛన్ల పరిశీలన.

జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నెలనెలా ఫించన్లు అందుకుంటున్న లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోతోంది. వీటిని మరింత తగ్గించడం ద్వారా రూ.కోట్ల భారం తగ్గించుకోవాలని సర్కారు చూస్తోంది. దీనిలో భాగంగా దృష్టిలోపం ఉన్న వారికి, దివ్యాంగులకు, మానసిక వ్యాధిగ్రస్తులు, వినికిడి సమస్య ఉన్నవారికి, మానసిక ఇబ్బందులు ఉన్నవారికి ఇస్తున్న పింఛన్లలో సైతం కోత పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. తాము అధికారంలోకి వస్తే వీరికి నెలకు రూ.ఆరు వేలు పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత మాట ప్రకారం పింఛన్ పెంచారు. ఇదే సమయంలో కొంతమందికి పింఛన్ కోత పెట్టేందుకు సైతం సిద్ధమయ్యారు.

గతంలో అనర్హులకు పింఛన్లు అందించారనే ప్రచారం మొదలు పెట్టిన కూటమి ప్రభుత్వం కొన్నింటిని తొలగించే కుట్రకు తెరదీసింది. ఇందుకు అనుగుణంగా లబ్ధిదారుల పరిశీలన అంటూ ఇదివరకే మంచం మీద ఉండి కదలలేని వారిని ఇళ్లకు వెళ్లి పరిశీలించిన విషయం తెలిసిందే. వీరికి నెలకు రూ.15 వేల వరకు ఫించన్ సొమ్ములు అందుతున్నాయి. మిగిలిన లబ్ధిదారులను మాత్రం ఏరియా ఆస్పత్రులకు, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి, దృష్టిలోపం ఉన్న వారికి, దివ్యాంగులకు, మానసిక వ్యాధిగ్రస్తులు, వినికిడి సమస్య ఉన్న వారికి, మానసిక ఇబ్బందులు ఉన్నవారిని మాత్రం ఏరియా ఆస్పత్రులు, ఎంపిక చేసిన పీహెచ్‌సీల వద్దకు రావాల్సిందిగా సూచించారు. దీనితో ఆయా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు ఎంపిక చేసిన ఆస్పత్రులకు వెళ్లి తాము వ్యాధులు బారిన పడ్డామని, పింఛన్లకు అర్హులమని నిరూపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

జిల్లాలో దివ్యాంగ పింఛన్లు 16,942 వరకు ఉండగా, దృష్టి లోపం ఉన్న పింఛనుదారులు 4,026 మంది ఉన్నారు. వినికిడి లోపం ఉన్నవారు 3,995 మంది కాగా, మానసిక వికలాంగుగులు 3,749 మంది, మానసిక ఇబ్బందులు ఉన్నవారు 1,277, బహుళ లోపాలు ఉన్నవారు 2,112, మొత్తం 32,101 మంది పింఛన్‌దారులకు నెలకు రూ.19.26 కోట్లు అందాల్సి ఉంది.

గతం నుంచి పింఛన్ తీసుకుంటున్నాను



నాకు రెండు కాళ్లు పనిచేయవు. ప్రభుత్వం నుంచి నాకు గతం నుంచి పింఛను వస్తోంది. కాని ఇప్పుడు తనిఖీ కోసమని పిలిచారు. మా ఊరి నుంచి రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి రావాల్సి వచ్చింది.

– కంద్రకోట వెంకాయమ్మ, అముజూరు. కె.గంగవరం మండలం

అష్టకష్టాలు పడి..

దివ్యాంగ పింఛన్ల తనిఖీ కోసం అమలాపురం, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంది. దివ్యాంగులు ఈ రెండు ఆస్పత్రులతో పాటు రాజోలు, కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంది. మానసిక వ్యాధిగ్రస్తులు కాకినాడ జీజీహెచ్‌కు, చెవి సంబంధింత వ్యాధి ఉన్నవారు రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వెళ్లాల్సి ఉంది. ఆయా పింఛనుదారులు తమ కుటుంబ సభ్యులను తీసుకుని ఆటోలు, ఇతర వాహనాలపై ఆస్పత్రులకు చేరుకోవాల్సి వస్తోంది. ఒక్క రోజుకు దివ్యాంగులు 60 మందిని, దృష్టిలోపం ఉన్నవారిలో 40 మందికి పరీక్షలు చేస్తున్నారు.

దృష్టిలోపం ఉన్నవారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. జిల్లాలో కేవలం రెండు ఏరియా ఆస్పత్రులలో మాత్రమే వీరికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనితో సఖినేటిపల్లి, ఆత్రేయపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి రావాల్సి వస్తోంది. ఇది తమకు వ్యయ ప్రయాసలతో కూడుకున్న విషయమని వారు వాపోతున్నారు. దివ్యాంగులు, ఇతరుల పరిస్థితి కూడా ఇంతే. ఇక కాకినాడ, రాజమహేంద్రవరం వెళ్లాలంటే మరిన్ని పాట్లు పడాల్సి వస్తోందని వారు ఆయా పింఛన్ల లబ్ధిదారులు వాపోతున్నారు. కనీసం మండలాల వారీగా అందుబాటులో ఉన్న పీహెచ్‌సీల వద్ద ఈ తనిఖీలు చేస్తే లబ్ధిదారులకు ఇన్ని ఇక్కట్లు తప్పేవి కావు. కనీసం ఆ విధంగా కూడా లబ్ధిదారుల పట్ల కూటమి ప్రభుత్వం కనికరం చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే



అమలాపురం టౌన్: జిల్లాలో వైఎస్సార్ సీపీ 20 అనుబంధ విభాగాలకు కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం అధ్యక్షులను నియమించింది. పార్టీ రాష్ట్ర అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయి. పార్టీ జిల్లా యువజన విభాగానికి రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పిల్లి సూర్యప్రకాష్‌ను, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా వంగా గిరిజా కుమారిని (అమలాపురం) నియమించారు. అలాగే రైతు విభాగానికి జిన్నూరి వెంకటేశ్వరరావు (అమలాపురం), బీసీ సెల్‌కు మట్టపర్తి నాగేంద్ర (అమలాపరం), ఎస్సీ సెల్‌కు గొల్లపల్లి డేవిడ్‌రాజు, (కొత్తపేట), ఎస్టీ సెల్‌కు కుర్రా శ్రీనివాస్ (కొత్తపేట), మైనార్టీ సెల్‌కు షేక్ అబ్దుల్ ఖాదర్ (అమలాపురం), క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు ఈద సంధ్య (రాజోలు), విద్యార్థి విభాగానికి మిండగుదటి వెంకట సాయి శిరీష్ నారాయణస్వామి (పి.గన్నవరం), పంచాయతీరాజ్ విభాగానికి మల్లిమొగ్గల శ్రీధర్ (రామచంద్రపురం), ఆర్‌టీఐ విభాగానికి తోటే జాన్‌బాబు (రాజోలు), వలంటీర్ల విభాగానికి దాకే చిరంజీవి (రాజోలు), గ్రీవెన్స్ విభాగానికి దొంగ నాగ సత్యనారాయణ (రాజోలు), వీవర్స్ విభాగానికి జె.గణేష్ (అమలాపురం), అంగన్‌వాడీ విభాగానికి కుక్కల విజయలక్ష్మి (రామచంద్రపురం), కల్చరల్ విభాగానికి మన్యం వీరబాబు (కొత్తపేట), సోషల్ మీడియా విభాగానికి దొమ్మేటి సత్య మోహనరావు (పి.గన్నవరం), ఐటీ విభాగానికి తోరం గౌతమ్ రాజు (పి.గన్నవరం), పబ్లిసిటీ విభాగానికి మద్దుల హరి పద్మనాభం అనే కాసు బాబు (రాజోలు), ఇంటెలెక్చువల్స్ ఫోరం విభాగానికి అగస్‌బకర్ హుస్సేన్‌లను అధ్యక్షులుగా నియమించారు.

ఝాన్సీరాణి ఆదర్శం కావాలి

ఆత్మరక్షణ శిక్షణలో బాలికలకు ఆర్డీఓ మాధవి పిలుపు



విద్యార్థినులకు ఆత్మ రక్షణపై శిక్షణ ఇస్తున్న ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి

అమలాపురం టౌన్: ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా బాలికలు ఆత్మ విశ్వాసంతో ఎదుర్కోవాలని, ఇందుకు ధైర్య సాహసాలు ప్రదర్శించి చరిత్ర పుటలకు ఎక్కిన రాణీ లక్ష్మీబాయిని బాలికలు ఆదర్శంగా తీసుకోవాలని అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆత్మ రక్షణ పద్ధతులను బోధించేందుకు బుధవారం ఏర్పాటు చేసిన 'రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ' శిక్షణ కార్యక్రమానికి ఆర్డీవో మాధవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ సంయక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి డీఈవో, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ షేక్ సలీమ్ బాషా అధ్యక్షత వహించారు. రూపేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ పర్యవేక్షణలో జరిగిన ఈ తరగతుల్లో బాలికలకు ఆత్మ రక్షణ చిట్కాలను ప్రయోగాత్మకంగా చేసి చూపారు. కరాటే నేర్పి ప్రత్యర్థులను ఇట్టే మట్టికరిపించే విధానాలపై అవగాహన కల్పించారు.

జిల్లాలో 293 ఉన్నత పాఠశాలలు, 69 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థినులకు ఆత్మ రక్షణపై శిక్షణ తరగతులు నిర్వహించడం ప్రారంభించామని డీఈవో సలీమ్ బాషా తెలిపారు. తొలి శిక్షణను అమలాపురం నుంచే ప్రారంభించామన్నారు. బాలికల భద్రత, రక్షణ ప్రధాన లక్ష్యాలుగా జిల్లాలో చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గర్ల్ చైల్డ్ ఆఫీసర్ డాక్టర్ ఎంఏకే భీమారావు శిక్షణ తరగతులకు సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో అమలాపురం ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాష్, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ అధికారి వి.హనుమంతరావు, సెక్టోరియల్ అధికారి డి.రమేష్‌బాబు, సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, జెడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయినులు వి.విజయకుమారి, ఎస్.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదికి 46 ఆర్టీసీ సర్వీసులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి దివ్య కళ్యాణం, రథోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అంతర్వేదికి ఆర్టీసీ అమలాపురం నుంచి 46 బస్ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. స్వామివారి కళ్యాణం, రథోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 7, 8 తేదీల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఆర్టీసీ సర్వీసులు నడుస్తాయన్నారు. భక్తుల కోసం అమలాపురం, అప్పనపల్లి, పల్లం ప్రాంతాల నుంచి బస్సులు నడుస్తాయని డీఎం తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేసి స్వామివారిని దర్శించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పంపిణీకి లక్ష కలాలు సిద్ధం

- మూడు వేల మందికి 1.2 లక్షల కలాల పార్శిల్
- రిజిస్టర్ పోస్టు, కొరియర్ ద్వారా భక్తులకు పంపిణీ



సప్త నదీ జలాలు, లక్ష కలాల పూజలకు రశీదు తీసుకున్న భక్తులకు కలాలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో చదువుల పండుగ, సప్తనదీ జలాల అభిషేకంలో రుసుము చెల్లించి టిక్కెట్లు తీసుకున్న భక్తులకు స్వామివారి పాదాల చెంత ఉంచిన లక్ష కలాలను పంపిణీ చేసేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. రూ.250 చెల్లించిన భక్తులకు 10 కలాలు, రూ.550 చెల్లించిన భక్తులకు 40 కలాలను పంపిణీ చేసేందుకు పార్శిల్స్ సిద్ధం చేశారు. భక్తులు రశీదు తీసుకునే ముందు కోరిన విధంగా వారి చిరునామాలకు రిజిస్టర్ పోస్టు, కొరియర్ ద్వారా, నేరుగా స్వామి వారి ఆలయంలోను రశీదు చూపించి కలాలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆలయంలో నిర్వహించిన సప్తనదీ జలాలు, లక్ష కలాల పూజలకు రశీదు తీసుకున్న భక్తులు ఏ విధమైన ఇబ్బంది పడక్కరలేదన్నారు. వారికి స్వామి వారి కలాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సుమారు 3008 మంది భక్తులకు 1.20 లక్షల కలాలు పంపిణీకి ఆలయ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కలాలు పార్శిల్ చేసేందుకు విఘ్నేశ్వరస్వామివారి ఆలయ సిబ్బందితో పాటు, ప్రత్యేకంగా అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ ఆలయం నుంచి సిబ్బందిని తీసుకొచ్చారు. అలాగే స్వామి సప్తనదీ జలాలను తమ సిబ్బంది నుంచి ఆలయ పనివేళల్లో భక్తులు తీసుకోవచ్చునన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 – 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

గరుడ గమనా.. పుష్పక వాహనా..

- లక్ష్మీ సమేతుడై ఊరేగిన నారసింహుడు
- తన్మయంతో దర్శించిన భక్తజనం
- ఏర్పాట్లు చేసిన అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో కొలువైన లక్ష్మీ నృసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గరుడ పుష్పక వాహనంపైన, రాత్రి పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిత్యం తనను సేవించే గరుడ వాహనంపై అధిరోహించడమే గరుడ వాహన సేవలోని పరమార్థం. అలాగే తన హృదయ మనే పుష్పకంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటేందుకు స్వామివారు పుష్పక వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఇది పుష్పక వాహనం పరమార్థం. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఆలయ వ్యవస్థాపక అనువంశిక సభ్యుడు రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ప్రముఖులు, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్కాంతులతో దేవతామూర్తుల ఫ్లెక్సీలు

లక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఫ్లెక్సీలు భక్తులను ఎంతోగానో ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు పశ్చిమ రాజగోపురం, ప్రధాన, ఉపాలయాల గోపురాలు విద్యుల్లతలతో శోభిల్లుతున్నాయి.

అంతర్వేదిలో నేడు..

ఉత్సవాల్లో భాగంగా గురువారం మూడో రోజు ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ స్వామివారి తిరువారాధన, బాలభోగం, అర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హంసవాహనంపై, 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ధ్వజారోహణ. రాత్రి 8 గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవాలను నిర్వహించనున్నారు.



విద్యుద్దీపాలంకరణలతో ఆకట్టుకుంటున్న ప్రధాన, ఉపాలయాలు

స్వామివారి సన్నిధిలో ఏలూరు రేంజి ఐజీ

అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని పి.వి జయ సారధి అందజేశారు. ఆయన వెంట కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీ మోహన్, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గరుడ, పుష్పక వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

క్షేత్ర స్థాయిలో ఏర్పాట్ల పరిశీలన

అంతర్వేది ఉత్సవాలను పురస్కరించుకుని ఐజీ అశోక్ కుమార్ అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. 7వ తేదీన నిర్వహించే స్వామివారి కల్యాణ వేదక వద్ద, వేదిక ఇరువైపులా ఉన్న భారీ షెడ్లలో గ్యాలరీల ఏర్పాట్లపై ఆలయ సూపరింటెండెంట్ విజయ సారధి ఐజీకి వివరించారు. 8న రథోత్సవం, 12న పౌర్ణమి సముద్ర స్నానాల ఏర్పాట్లను సైతం ఐజీ సమీక్షించారు.



ఐజీ అశోక్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

8న పుట్టకొండ లక్ష్మీ నరసింహుని కల్యాణం

పెదపూడి: శతాబ్దాల చరిత్ర కలిగిన పెదపూడి మండలం పుట్టకొండ లక్ష్మీ నరసింహస్వామి దివ్య కల్యాణం ఈ నెల 8న ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఓ వద్దాది సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపక సభ్యుడు పి.అనంతాచార్యులు తెలిపారు. 8న భీష్మ ఏకాదశి శనివారం రాత్రి తెల్లవారు జామున 4 గంటలకు అనగా (ఆదివారం) స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో కల్యాణ మూర్తులు లక్ష్మీ నరసింహస్వామి, గోదాదేవి, వేంకటేశ్వరస్వామి

అనంతరం తొమ్మిదో తేదీన నిత్యహోమం, బలిహరణ, పదిన గజవాహన సేవ, 11న అశ్వవాహన సేవ, 12న పూర్ణాహుతి, చక్రతీర్థం, 13న శ్రీ పుష్పయాగం, ద్వాదశ అర్చనలతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.



పుట్టకొండ గ్రామంలోని స్వామి వారి ఆలయం

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాం చివర గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మంగళవారం రాత్రి పట్టాలు దాటుతుండగా విజయవాడ వైపు వెళ్తున్న రైలు ఢీ కొట్టడంతో అతడు మృతి చెందాడని, అతని శరీ రం నుజ్జవడంతో గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఛిద్రమైందని తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, సిమెంట్ రంగు జీన్ ప్యాంటు, నలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి మోచేయి పైన సిరి అని ఇంగ్లీషులో పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి శరీర భాగాలను తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరచినట్టు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీస్ స్టేషన్, ఫోన్ నెంబర్ 94906 19020 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

చెత్త తగలబెడుతుండగా పేలుడు

ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులకు గాయాలు

కాకినాడ రూరల్: వేకువ జామునే విధులకు వెళ్ళిన రమణయ్యపేట పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తగలపెడుతుండగా ఒక్కసారిగా వచ్చిన పేలుడుతో తీవ్రంగా గాయపడ్డారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద రెండు రోజుల క్రితం చెత్తను తగలబెడుతుండగా సమీపంలోని ఇంటి వారు చెత్తతో ఉన్న కవర్‌ను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయడంతో దానిని చెత్త మంటలో వేయగా కొద్ది సేపటికి పెద్ద శబ్దంతో పేలి మంటలు వ్యాపించాయి. దీంతో అక్కడే ఉన్న ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు కోమాటి లక్ష్మి, కాకినాడ పోచమ్మ, ధనాల గణేష్ గాయపడ్డారు. పోచమ్మ ఒంటిపై కాలిన గాయాలు తీవ్రం కావడంతో జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. మిగిలిన ఇద్దరు చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు. కవర్‌లో ఉన్న బాడీ స్ప్రే సీసాలే పేలుడుకు కారణమని భావిస్తున్నారు.

అలసిన మనసుకు సాంత్వన కళ

- ప్రముఖ కవి జొన్నవిత్తుల
- చిత్తు కాగితాలతో చిత్రరువుల రూపకల్పన
- శ్రీప్రకాష్‌లో ఆకట్టుకున్న 'హరివిల్లు'

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మానవ జీవితంలో కళ అత్యుత్తమమైనదని, అది అలసిన మనసుకు ప్రశాంతతను ఇస్తుందని సుప్రసిద్ధ కవి, సినీ గేయ రచయిత, తెలుగు అధికార భాషా సంఘ మాజీ సభ్యుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సురేష్‌నగర్‌లో శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో 'హరివిల్లు–2025' ఆర్ట్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థులలో నిద్రాణమై ఉన్న శక్తిని వెలికి తీసి, సమాజానికి ఒక అద్భుతమైన సందేశాన్ని ఇచ్చేలా కళాకృతులు ఉన్నాయన్నారు. గౌరవ అతిథి భారతీయ చిత్రకారిణి, ప్రింట్ మేకర్ గౌరి వేముల మాట్లాడుతూ కళ అనేది తపస్సు అని, కళాకారుడు ఒక ఋషీశ్వరుడని అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. గ్రంధి రాజగోపాల్, ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకుడు కిశోర్‌కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రాలు, కళారూపాలను అతిథులకు వివరిస్తున్న చిన్నారి

హైస్కూల్‌కు ఫర్నిచర్ వితరణ

ఆలమూరు: మండలంలోని చెముడులంక జెడ్పీ హైస్కూల్‌కు రాజమహేంద్రవరం ఎస్‌బీఐ శాఖ రీజనల్ మేనేజర్ తాడిపత్రి శ్రీనివాస్ రూ.ఐదు లక్షల విలువైన ఫర్నిచర్ బహూకరించారు. బుధవారం స్థానిక హైస్కూల్‌కు ఆయన హాజరై హెచ్‌ఎం భమిడిపాటి శివరామకృష్ణకు 18 బెంచీలు, రెండు కంప్యూటర్లు, నాలుగు బీరువాలతో పాటు ఉపాధ్యాయులకు పది టేబుళ్లు, కుర్చీలను అందజేశారు. అలాగే హైస్కూల్‌కు అవసరమైన మైక్ సిస్టమ్‌ను సైతం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ తమ రీజన్ పరిధిలో 43 శాఖా కార్యాలయాలు ఉన్నాయని, చెముడులంకలో సుదీర్ఘకాలంగా ఉన్న తమ శాఖా కార్యాలయంలో వేలాది మంది ఖాతాదారులు ఉన్నారన్నారు. ఖాతాదారుల ప్రయోజనాలతో పాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో జెడ్పీ హైస్కూల్‌కు ఈ ఫర్నీచర్ బహూకరించామన్నారు. హెచ్‌ఎం శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎస్‌బీఐ హెచ్‌ఆర్ మేనేజర్ పవన్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ వెంకట రమణను ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ తమ్మన భాస్కరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, పీఎంసీ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి రాము, అభివృద్ధి కమిటీ చైర్మన్ తిర్నాతి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బహూకరించిన ఫర్నిచర్‌తో ఎస్‌బీఐ అధికారులు, ఉపాధ్యాయులు

స్కూలు బస్సు ఢీకొని చిన్నారి మృతి

తొండంగి: మండలంలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం స్కూలు బస్సు ఢీకొని మూడేళ్ల పాప మృత్యువాతపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తునికి చెందిన ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల బస్సు విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తుండగా సీతారాంపురంలో మూడేళ్ల పాప శివకోటి సుకన్య (3)ను బస్సు ఢీకొట్టింది. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే మృత్యువాతపడింది. దీంతో చిన్నారి తండ్రి శివకోటి సింహాద్రి అప్పన్న ఇతర కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు కొల్లా బత్తుల దిలీప్, శివకోటి అప్పారావు, జట్టు చిన్నబాబు, అంబేడ్కర్ యూత్ సభ్యులు ఆందోళన చేయడంతో ఇన్‌చార్జి ఎస్సై బి.కృష్ణమాచారి అక్కడికి చేరుకున్నారు. దీంతో స్కూలు యాజమాన్యం స్పందించి పాప కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. పాప తండ్రి అప్పన్న ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు.



శివకోటి సుకన్య (ఫైల్)



పాప మృతితో న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ప్రేమించి వంచించాడు.. పెళ్లంటే పొమ్మన్నాడు..

బాలుడిపై బాలిక ఫిర్యాదు

రాజానగరం: ప్రేమించానన్నాడు.. వంచించాడు.. పెళ్లి మాటెత్తితే కాదు పొమ్మన్నాడు. 16 ఏళ్ల బాలిక 18 బాలుడిపై ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం రాజానగరంలో జరిగిన ఈ సంఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలు ఇలా వున్నాయి. రాజానగరానికి చెందిన ఆ మైనర్లు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. నరేంద్రపురం కూడలిలో జులాయిగా తిరిగే ఆ బాలుడు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకునే రోజుల నుంచి ఆమె వెంటపడేవాడు. చివరకు తనతోనే లోకం అనేలా ఆమెకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. పదో తరగతి వరకు చదివిన ఆ బాలిక పెళ్లి చేసుకుందామని ఒత్తిడి చేయడంతో పెళ్లంటే తనకు ఇష్టం లేదని పొమ్మన్నాడు. దీనితో న్యాయం కోసం ఆ బాలిక స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఇద్దరూ మైనర్లే కావడంతో పోలీసులు పోక్సో కేసుగా నమోదు చేసి, నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎస్సై నారాయణమ్మ దర్యాప్తు చేస్తున్నారు.

ఆదివాసీ నృత్యహేల

రాజానగరం: థింసా, లంబాడీ వంటి గిరిజన నృత్యాలు ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆవిష్కృతమయ్యాయి. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు జరిగే ఆదివాసీ సంస్కృతీ మహోత్సవాలు యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ఆదివాసీ కళాకారులు ప్రదర్శించిన జానపద, థింసా, లంబాడీ వంటి నృత్య ప్రదర్శనలు సభికులను విశేషంగా అలరించాయి. వే దికపై ఆసీనులైన ముఖ్య అతిథులు సైతం స్పందించి, కొద్దిసేపు కళాకారులతో కలసి డ్యాన్సు లేసి, విద్యార్థులను కేరింతలు కొట్టించారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి

ఉత్సవాల ప్రారంభ సభ లో యూనివర్సిటీ ఇన్‌చా ర్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు ఒక భాగమని, వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. గోదావరి జిల్లాల్లోని గిరిజన, గిరిజనేతర విద్యార్థులందరికీ ఉన్నత విద్య అందిస్తూ, వారి ఉన్నతికి వర్సిటీ పరంగా కృషి జరుగుతోందని చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యాన్ని పరిరక్షించడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, కళలతోనే సమాజ వికాసం జరుగుతుందన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, అడవి బిడ్డల జీవన విధానం ప్రత్యేక శైలిలో, ఆరోగ్యకరంగా ఉంటుందని అన్నారు. టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణు నాయక్ మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధిలో నాటికి, నేటికి పెద్దగా తేడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల సూచించారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించి, ప్రోత్సహించాలని టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్, సహాయ అధ్యాపకుడు దొర కోరారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తాళ్లపూడి: పలు చోరీ కేసుల్లో నింతుడిని అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దేవంలో జనవరి 30న ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసును ఐదు రోజుల్లో ఛేదించినట్టు ఎస్సై తెలిపారు. మలకపల్లి బస్టాండ్ వద్ద మంగళవారం గోపాలపురం మండలం బీమోలుకు చెందిన చుక్కల బాబిని నిందితుడుగా గుర్తించి అదుపులోకి తీసుకుని పోగొట్టుకున్న మంగళ సూత్రాలు, నల్లపూసలు, ఉంగరాలు, పట్టీలు, బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు పర్యవేక్షణలో సీసీఎస్ ఎస్సై రవీంద్రతో కలిసి కేసును ఛేదించి సొత్తును రికవరీ చేశారు. నిందితుడు బాబీని కోర్టులో హాజరు పరచినట్టు ఎస్సై తెలిపారు.



పోలీసులు రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

పేకాడుతున్న 9 మంది అరెస్టు

రూ.77 వేల స్వాధీనం

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్న బృందంపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం రాత్రి దాడి చేశారు. 9 మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.77,520 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసై చోరీలు

- ముగ్గురు మైనర్లతో పాటు ఆరుగురి అరెస్టు
- 13 మోటార్ సైకిళ్ల స్వాధీనం
- అమలాపురం డీఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్: చెడు వ్యసనాలకు బానిసలైన ముగ్గురు యువకులు మరో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని వారు దొంగిలించిన 13 మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోనసీమతో పాటు ఇతర జిల్లాల్లో మొటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న వారి వివరాలను డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం గంజాయి, మద్యం తదితర వ్యసనాలతో డబ్బుకోసం వారు ఈ చోరీలకు పాల్పడినట్టు తెలిపారు. కోనసీమలోని వివిధ పోలీస్ స్టేషన్లతో పాటు విశాఖ జిల్లా పరిధిలోని కంచర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వారు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వారి నుంచి రూ.8.82 లక్షల విలువైన 13 మోటార్ సైకిళ్లను, మూడు బ్యాటరీలను రికవరీ చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

నిందితులైన కాట్రేనికోన మండలం చెయ్యేరు గున్నేపల్లికి చెందిన మేకల వీర వెంకట శ్రీరామ్ మూర్తి, అమలాపురం మండలం ఈదరపల్లి చెందిన వీరమల్లు తరుణ్ శశికుమార్, ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన దొంగ లోకేష్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు. రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ పర్యవేక్షణలో తాలూకా ఎస్సై వై.శేఖర్‌బాబు, క్రైమ్ ఏఎస్సై సుబ్బారావు, హెచ్‌సీ రవికుమార్, పీసీలు శివకుమార్, ధర్మరాజు నిందితులను పట్టుకోవడంలో శ్రమించారన్నారు. వారికి రివార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లను చూస్తున్న డీఎస్పీ ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్

చికిత్స పొందుతున్న యువతి మృతి

అమలాపురం టౌన్: ఈనెల 2న స్థానికంగా జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరానికి చెందిన నలబ శ్రీదేవి (20) చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల మేరకు పదో తరగతి వరకూ చదివి ఇంటి వద్దే ఉంటున్న శ్రీదేవి అమలాపురం మార్కెట్ వీధిలోని బంధువుల ఇంటికి వచ్చి ఆటోలో ఓడలరేవు బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయమై విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం ఆమెకు అంత్యక్రియల సందర్భంగా ఆమె జ్ఞాపకాలను తలచుకుని కుటుంబీకులు రోదించారు. ఈ ప్రమాదంలో గాయపడిన మిగిలిన ఏడుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సీఐ తెలిపారు.